క్లుప్తంగా

ఇంటర్‌లో డివిజన్ టాపర్‌కు సన్మానం



డివిజన్ టాపర్ హిందును సన్మానిస్తున్న సామాజిక ఆశయ సాధన సేవ సభ్యులు

బాన్సువాడ : ఇంటర్‌లో బాన్సువాడ డివిజన్ టాపర్‌గా నిలిచిన గైని హిందును (957) శుక్రవారం సామాజిక ఆశయ సాధన సేవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఈసంస్థ వ్యవస్థాపకులు సందుల గంగారం మాట్లాడుతూ గైని హిందూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు బంగారు మైశయ్య, నర్సింలు, గైని రవి, మన్నే చిన్న సాయిలు, సాయిలు, గంగాధర్, శివ్వయ్య తదితరులున్నారు.

ఫాంపాండ్స్ ఏర్పాటు చేయాలి



ఈజీఎస్ సిబ్బందితో సమావేశంలో ఏపీడీ

ఎల్లారెడ్డిరూరల్: ప్రతి గ్రామంలో ఫాంపాండ్స్ నిర్మాణాలు చేసేలా ఈజీఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఈజీఎస్ ఏపీడీ వామన్‌రావు అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రౌండ్ వాటర్ తగ్గుముఖం పడుతుందని, దీన్ని అధిగమించాలంటే ప్రతి గ్రామంలో కనీసం ఐదు ఫాంపాండ్స్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో కనీసం వందమంది ఉపాధి కూలీలు పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రకాష్, ఏపీవో వినోద్, టీఏలు జయశ్రీ, ఆనంద్ తదితరులున్నారు.

చిత్రలేఖనంపై శిక్షణ



చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తున్న డ్రాయింగ్ మాస్టర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపు శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు చిత్రలేఖనంలో పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి 135 మంది విద్యార్థులు సమ్మర్ క్యాంపులో పాల్గొన్నట్లు మండల విద్యాధికారి షౌకత్‌అలీ తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త వహీద్‌సిద్దీఖీ, యుసుఫ్, మేహర్, సాయిరాం, సంతోష్, ఖాసీం, తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వారికే 'యువవికాసం' వర్తిస్తుంది



దరఖాస్తులను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రాజారాం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రాజీవ్ యువవికాస్ పథకం అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తుందని మండల ప్రత్యేక అధికారి రాజారాం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రాజీవ్ యువవికాస్ పథకం దరఖాస్తులను పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి 1337 దరఖాస్తులు వచ్చినట్లు వివరించారు. ఈ దరఖాస్తుల వివరాలను వారి గ్రామాలకు సంబందించిన బ్యాంకుల అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఎంపీవో సవితారెడ్డి, గ్రామ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు.

పాకిస్తాన్‌పై పోరులో మనోడు



భిక్కనూరు: పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరులో భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన రామారం విజయ్‌కుమార్ పాల్గొంటున్నట్లు కుటుంబీకులు శుక్రవారం తెలిపారు. విజయకుమార్ 17 ఏళ్ల క్రితం సైన్యంలో చేరాడు. ప్రస్తుతం ఆయన కాశ్మీర్ సరిహద్దులో విధులు నిర్వహిస్తూ పాకిస్తాన్‌తో జరుగుతున్న పోరులో చురుకుగా పాల్గొంటున్నాడని గ్రామస్తులు తెలిపారు. విజయ్‌కుమార్‌కు తల్లి లక్ష్మి, భార్య స్వప్నరాణి, కుమారుడు సాత్విక్, కుమార్తె ఆరాధ్యలు ఉన్నారు.

ఆదాయం వస్తున్నా.. వసతులు కరువు

- తైబజారు పేరుతో పిట్లం సంతలో జోరుగా వసూళ్లు
- ఇబ్బంది పడుతున్న వ్యాపారులు



పిట్లంలో నిర్వహిస్తున్న సంత

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం పశువులు, గొర్రెలు, మేకలతో పాటు కూరగాయల సంత నిర్వహిస్తారు. తైబజార్ పేరుతో జోరుగా వసూలు చేస్తున్న కాంట్రాక్టర్లు కనీస వసతులు కల్పించడం లేదని చిరు వ్యాపారులు, కూరగాయాల విక్రయదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారాంతపు, రోజు వారీ సంతల్లో తైబజార్ కాంట్రాక్టర్లు గ్రామ పంచాయతీ అధికారులు నిర్ణయించిన రేట్ల కంటే అధికంగా వసూలు చేస్తున్నారని చిరు వ్యాపారులు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల సంతలకు వేలం పాట నిర్వహించారు. కాంట్రాక్టర్లు మేకల సంతను రూ. 5.13 లక్షలకు, కూరగాయల సంతను రూ. 12.58 లక్షలకు, పశువుల దాఖల రూ.6.58 లక్షలకు సొంతం చేసుకున్నారు. సంతల వేలం ద్వారా ఒక సంవత్సరానికి గ్రామపంచాయతీకి రూ.24 లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. గ్రామపంచాయతీకి భారీగానే ఆదాయం సమకూరుతున్న వసతుల కల్పనను అధికారులు పట్టించుకోవడం లేదు.దీంతో ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఇబ్బందిపడుతున్నారు. మరుగుదొడ్లు, కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించడం లేదని వ్యాపారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేకలకు నీటి సౌకర్యం కల్పించడం లేదు. కనీసం సంతకు స్థలం లేక పోవడంతో మేకల సంతను గ్రామ చివర ప్రధాన రహదారి పక్కన నిర్వహిస్తున్నారు. కూరగాయల సంత నిర్వహణకు స్థలం లేక పోవడంతో పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, పోలీస్ స్టేషన్ ఎదురుగా, ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా రోడ్లపైనే కూరగాయలు విక్రయించాల్సి వస్తోంది. గ్రామ పంచాయతీ అధికారులు అధికారులు స్పందించి సంతలో మరుగు దొడ్లు, తాగు నీటి తదితర సరైన వసతులు కల్పించాలని, సంతలలో జీపీ సూచించిన తైబజార్ రేట్ల ఫ్లెక్సీలను ప్రదర్శించాలని వ్యాపారులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలి



పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడుతున్న ఏడీఏ అరుణ

పెద్దకొడప్‌గల్(జుక్కల్): జొన్న కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూడాలని బాన్సువాడ ఏడీఏ అరుణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె జొన్న కొనుగోలుపై వచ్చిన ఆరోపణలను రైతులతో చర్చించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.అనంతరం రైతులు జొన్నల కొనుగోలు పరిమితి ఎకరానికి 32 క్వింటాల్ వరకు పెంచాలని కోరారు.ఏవో కిషన్,ఎఈవో రూప సోసైటీ కార్యదర్శి సందీప్ రైతులు పాల్గొన్నారు.

బాన్సువాడ నుంచి వేములవాడకు బస్సు సౌకర్యం



బాన్సువాడ నుంచి వేములవాడకు బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న డీఎం

బాన్సువాడ : బాన్సువాడ నుంచి ప్రతి రోజు వేములవాడకు బస్సు సర్వీసు నడుపుతున్న ఆర్టీసీ డీఎం సరితాదేవి తెలిపారు. శుక్రవారం బాన్సువాడ బస్టాండ్‌లో బస్సు సర్వీసును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేములవాడ పుణ్యక్షేత్రానికి ప్రతి రోజు ఉదయం 8:20 గంటలకు బాన్సువాడ బస్టాండ్ నుంచి ప్రారంభం అవుతుందని, 10 గంటలకు కామారెడ్డికి చేరుకుని అక్కడి నుంచి 11:40 గంటలకు వేములవాడకు చేరుకుంటుందని, అక్కడి నుంచి తిరిగి కామారెడ్డి మీదుగా సాయంత్రం 6:10 గంటలకు బాన్సువాడకు చేరుకుంటుందని ఆమె అన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టోల్‌ప్లాజా నిర్మాణ స్థలం వద్ద రైతుల నిరసన



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న శాశ్వత టోల్‌గేట్ నిర్మాణపనుల వద్ద రైతులు శుక్రవారం నిరసన తెలిపారు. రైతుల భూములను అక్రమించుకుని టోల్‌ప్లాజాను నిర్మిస్తున్నారని వెంటనే నిర్మాణ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. శాశ్వత టోల్‌ప్లాజా నిర్మాణంతో రైతులు చాలా మంది తమ వ్యవసాయభూముల్లోకి వెళ్లేందుకు రోడ్డు కూడా ఉండదని వారు వారి పంటపొలాల్లోకి ఎలా వెళ్లాలని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నేషనల్‌హైవే అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

'ఆపరేషన్ సిందూర్'ను స్వాగతించిన తపస్



మాట్లాడుతున్న తపస్ నాయకులు

కామారెడ్డి టౌన్ : పాకిస్తాన్‌పై భారత ప్రభుత్వం చేస్తున్న 'ఆపరేషన్ సిందూర్' ను స్వాగతిస్తున్నట్లు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) నాయకులు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేసి ఉగ్రవాద దాడులో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు పుల్గం రాఘవరెడ్డి, రాష్ట్ర బాధ్యులు భాస్కరా చారి, టీ. భాస్కర్, మధుసూదన్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

భారత సైనికులకు ఆర్యవైశ్య సంఘం మద్దతు



మాట్లాడుతున్న ఆర్యవైశ్య నాయకులు

భిక్కనూరు: దేశ రక్షణ కోసం నడుం బిగించిన భారత సైనికులకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం భిక్కనూరు పట్టణాధ్యక్షుడు పురాం రాజమౌళి అన్నారు. శుక్రవారం స్థానిక నగరేశ్వరాలయంలో సమావేశమైన ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు యుద్ధంలో అమరులైన భారత సైనికుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.ఈ సందర్భంగా పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రాజమౌళి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైన్యానికి అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, శ్రీరాం చంద్రశేఖర్, అతిమాముల రమేష్, కోడిప్యాక అంజనేయులు,బోందుగుల సత్యం, పబ్బ కిరణ్, ధన్నారపు శ్రీరాం, బంక్ శ్రీనివాస్,చీకోటి ప్రభాకర్, శనిశెట్టి వినోద్, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం దాడిని ఖండిస్తున్నాం



మాట్లాడుతున్న విజయ భాస్కరరావు

కామారెడ్డి టౌన్: పాకిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాదులను ప్రోత్సహించడం సరికాదని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ విజయ భాస్కరరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత కొద్ది రోజుల క్రితం పహల్గాంలో భారతీయులపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కటికం రాజిరెడ్డి, జిల్లా కన్వీనర్ రవీందర్ రెడ్డి, జిల్లా మీడియా ఇన్‌చార్జీ సంకినారాయణ, గండెం నాగభూషణం, అంబాల రవి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరుగా శిశుమందిర్ పాఠశాలలు



సంస్కృతి శిబిరంలో పాల్గొన్న ప్రముఖులు

కామారెడ్డి అర్బన్: శిశుమందిర్ పాఠశాలలు పిల్లలకు విద్యతో పాటు క్రమశిక్షణ, సంస్కృతి సంప్రదాయాలు, నైతిక విలువలు నేర్పుతాయని కామారెడ్డి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నంద రమేష్ అన్నారు. స్థానిక శ్రీసరస్వతి విద్యామందిర్ హైస్కూల్‌లో శుక్రవారం వేసవిశిబిరం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నంద రమేష్, పట్టణ ప్రముఖులు అశోక్‌రావు, సామల గంగారెడ్డి, సురేందర్‌లు పాల్గొని మాట్లాడారు. వివిధ అంశాల్లో విద్యార్థులకు వేసవి శిబిరం నిర్వహించడంపై పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. హెచ్‌ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొప్ప సంఘసంస్కర్త శ్రీ బసవేశ్వర మహరాజ్



బాన్సువాడ రూరల్: సమాజంలో కులవ్యవస్థను, వర్ణ విభేదాలను, లింగ వివక్షతను సమూలంగా వ్యతిరేకించిన గొప్ప సంఘ సంస్కర్త శ్రీ బసవేశ్వర మహరాజ్ అని బిచ్కుంద మఠం పీఠాధిపతి సోమలింగ శివాచార్య స్వామీజీ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బసవేశ్వరుని ఆదర్శంగా తీసుకుని కుల,మతాలకు అతీతంగా దేశం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో దేగ్లూర్ దేవేందర్, ఉద్దర హన్మాండ్లు, మల్లికార్జున్, అంజు, శంకర్, హనుమాన్లు, సంగప్ప, భాస్కర్, లింగం, గంగాధర్ , శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న వెంకటలక్ష్మి

రాజంపేట: గ్రామీణ ప్రాంత మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో ఎస్‌బీఐ బ్యాంకు సౌజన్యంతో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని మండల కేంద్రంలో గత నెల ప్రారంభించారు. ఈ శిక్షణ కేంద్రంలో భాగంగా సబ్సిడీ కింద రూ.6500 లకు 25 మంది మహిళలకు గ్రామ స్వరాజ్య సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి చేతుల మీదుగా కుట్టుమిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక ఎంపీడీవో రఘురాం మాట్లాడుతూ.. సబ్సిడీ ద్వారా అందిస్తున్న ఈ కుట్టు మిషన్లను మహిళలు అందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ మండల కోఆర్డినేటర్ మ్యాడంపద్మ, పంచాయతీ కార్యదర్శి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

నిందితులను కఠినంగా శిక్షించాలి

పిట్లం(జుక్కల్): మండలంలోని అల్లాపూర్ అంగన్వాడీ సెంటర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. అంగన్‌వాడీ సెంటర్‌ను శుక్రవారం సీఐటీయూ జిల్లా నాయకులు సురేష్ గొండ పరిశీలించారు. అంగన్ వాడీ సెంటర్‌కు నిప్పు పెట్టిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ సెంటర్‌కు మరమ్మతులు నిర్వహించాలన్నారు.

వెల్లుట్లలో అనారోగ్యంతో మహిళ మృతి

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్ల గ్రామంలో లత అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యులను మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ పరామర్శించి రూ. 5వేల ఆర్థిక సహాయం అందించారు.

చిన్నారులను పాఠశాలలకు పంపాలి

ఎల్లారెడ్డి: తల్లిదండ్రులు 14 ఏళ్లలోపు చిన్నారును పాఠశాలలకు పంపాలని ఉపాధ్యాయులు ముజిబోద్దిన్ అన్నారు. శుక్రవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో పది, ఇంటర్ పాసైన విద్యార్థులను సన్మానించారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో కంటివైద్య శిబిరం

పిట్లం(జుక్కల్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలల్లో రాణిస్తున్న షోయబ్‌కు మంత్రి అభినందన

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మనవడు మహమ్మద్ షోయబ్‌ను రాష్ట్ర రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు. చదువుతో పాటు బ్యాడ్మింటన్, క్రికెట్ రంగాల్లో షోయబ్ రాణించడంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని షబ్బీర్‌అలీ నివాసంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం అభినందించారు. ఈకార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మహమ్మద్ ఇలియాజ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలో బీజేపీ పార్టీ బలోపేతానికి తమ వంతుకృషి చేస్తామని మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థ ఎన్నికల నాటికి ప్రతి గడపగడపకు బీజేపీ పార్టీని తీసుకెళ్తామన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ కొండ అనిల్ గుప్తా నాయకులు రాములు, ప్రవీణ్, రాజు, సతీష్, పోచయ్య, ప్రకాష్, రౌతు రాజు, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ ఫరీదా

కామారెడ్డి టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదా అన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీజీహెచ్ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సులు చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అహర్నిషలు విధుల్లో కృషి చేస్తున్న నర్సులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఆయా మండలాల స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్స్, ఎంఎస్‌వోలు, సిబ్బంది 56 మంది రక్తదానం చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకట్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ వనిత, కోశాధికారి బసవయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

సైనిక లాంఛనాలతో జవాన్ సచిన్ అంత్యక్రియలు



దెగ్లూర్‌లో సచిన్ అంత్యక్రియలను నిర్వహిస్తున్న ఆర్మీ అధికారులు

మద్నూర్(జుక్కల్): తెలంగాణ సరిహద్దులోని మహారాష్ట్రలోని దేగ్లూర్ తాలుకాలోని తమ్లూర్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వనంజే సచిన్ యాదవ్ (29) అంత్యక్రియలను శుక్రవారం దెగ్లూర్ పట్టణంలో బీఎస్ఎఫ్ అధికారులు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. సచిన్ దాదా అమర్ రహె.. భారత్ మాతాకి జై.. అంటు వేలాది గొంతులతో దేగ్లూర్ దద్దరిల్లింది. దేగ్లూర్, మద్నూర్, డోంగ్లీ, జుక్కల్ సరిహద్దు మండలాల్లోని ప్రజలు భారీగా సచిన్ అంతిమయాత్రలో పాల్గొన్నారు. కశ్మీర్‌లో సచిన్ నడుపుతున్న సైనిక ట్రక్కు మే 6న లోయలో పడిమృతి చెందిన విషయం తెలిసిందే. సచిన్ అంతిమయాత్రలో సికింద్రాబాద్ బీఎస్ఎఫ్ అధికారులు, మహారాష్ట్ర ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజలు పాల్గొన్నారు. సచిన్‌కు భార్య మధుర, 8నెలల కుమార్తె, తల్లిదండ్రులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

బ్రాహ్మణపల్లిలో బోనాల పండుగ



బ్రాహ్మణపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శుక్రవారం బోనాల పండుగను నిర్వహించారు. గ్రామ దేవతలకు గ్రామస్తులు బోనాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించారు. పిల్లాపాపలు, పాడి పంటలు సల్లంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులున్నారు.

ధర్మారెడ్డి గ్రామంలో..



ధర్మారెడ్డిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని ధర్మారెడ్డిలో శుక్రవారం శ్రీ రేణుకా ఎల్లమ్మ 61 వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు నెత్తిన బోనమెత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి బోనాలను సమర్పించి ప్రత్యేకపూజలు చేశారు.

రెండోరోజు లక్ష్మీనర్సింహుడి బ్రహ్మోత్సవాలు



గరుడ ప్రసాదం వితరణ చేస్తున్న అర్చకులు

మాచారెడ్డి : చుక్కాపూర్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. శుక్రవారం సేవాకాలం, యాగశాల ప్రవేశం, శాంతి పాఠం కార్యక్రమాలను, అనంతరం కుంభస్థాపన, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. సంతానం కాని దంపతులకు గరుడ ప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, డైరెక్టర్లు రాజిరెడ్డి, లక్ష్మీరాజం, వేదపండితులు, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా ఎడ్లబండ్ల ప్రదర్శన



ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహిస్తున్న గ్రామస్తులు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో శుక్రవారం దుర్గామాత ఆలయం వద్ద ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఎడ్లబండ్లను రంగులతో, మామిడి తోరణాలు, కొత్త చీరలతో అలంకరించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఊరేగించారు. అనంతరం దుర్గామాత ఆలయం చుట్టూ ఐదుసార్లు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పడిపూజ



అయ్యప్ప ఆలయంలో పడిపూజ చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో స్వామి వారి పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు, ఉత్సవ విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పడిమెట్లకు పూజలు చేసి పడి వెలిగించారు. కార్యక్రమంలో భక్తులు చంద్రంస్వామి, శ్రీనివాస్‌రావు, శ్రీకర్, విజయ్, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

శబరిమాత ఆశ్రమంలో పల్లకీ సేవ



పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శుక్రవారం పల్లకీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శబరిమాత దివ్యసమాధి, ప్రతిమ, చిత్రపటాన్ని రకరకాల పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాజాగౌడ్, గంగారాం, బాపురావు, రాంచంద్రం, సూర్యం, సిద్ధిరాంరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాజంపేట : మండల కేంద్రంలో శ్రీవేంకటేశ్వర బ్రహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణం, సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వడ్ల నరేష్, చారి, చంద్రం, గ్రామస్తులు పాల్గొన్నారు.